# చేవెళ్ల గడ్డ.. కాసానిదే..

**బడుగులమంతా ఏకమై గెలిపించుకుంటామని స్పష్టీకరణ**

**జాగ్రత్తగా లేకుంటే రాజకీయ నాయకులు చిన్నచూపు చూస్తారని హెచ్చరిస్తున్న బీసీ సంఘాల నేతలు**



రాజ్యాధికారం కోసం బడుగులమంతా ఏకమవ్వాల్సిన సమయం వచ్చిందని బీసీ సంఘాల నేతలు పేర్కొంటున్నారు. బీసీల పక్షాన ప్రశ్నించే గొంతుకగా ముందుండి పోరాటం చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని స్పష్టం చేస్తున్నారు. బడుగులు బలపడొద్దని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలను ఈ ఎన్నికల్లోనే తిప్పికొడదామని పిలుపునిస్తున్నారు. వాస్తవాలను గ్రహించి ముందుకు సాగితే రాజ్యాధికారం తప్పకుండా సాధ్యమేనని చెబుతున్నారు. బీసీ బిడ్డను గెలిపించుకోకపోతే రాజకీయ పార్టీలు బీసీలను చిన్నచూపు చూస్తాయని హెచ్చరిస్తున్నారు. అలాంటి పరిస్థితి రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని.. బీసీలను ఓటు బ్యాంకుగా చూసే నాయకులకు ఈ ఎన్నికల్లో వేసే ప్రతి ఓటూ చెంప పెట్టులా ఉండాలని సూచిస్తున్నారు. చేవెళ్ల గడ్డపై 'కాసాని'దే జయకేతనమని, బడుగులమంతా ఏకమై గెలిపించుకుని తీరుతామని ప్రతిన బూనుతున్నారు.

**- రంగారెడ్డి, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ)**

### కాసానికి బీసీల మద్దతు ఉంటుంది..



**-శంకర్ యాదవ్, రామన్నగూడ మాజీ సర్పంచ్ ,చేవెళ్లటౌన్**

బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలకు సముచిత ప్రాధాన్యమిచ్చింది. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కు కేసీఆర్ టికెట్ కేటాయించడంతో ఆయన్ను గెలిపించుకోవాల్సిన బాధ్యత బీసీలందరిపైనా ఉన్నది. కాసానిని గెలిపించి.. బీఆర్ఎస్ అధినేతకు బహుమతిగా ఇద్దాం.

### ఎగిరేది గులాబీ జెండానే..



**- శ్రీనివాస్, నారాయణదాస్‌గూడ, చేవెళ్లటౌన్**

చేవెళ్ల గడ్డపై ఈ పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురడం ఖాయం. కాసాని జ్ఞానేశ్వర్ భారీ మెజార్టీతో విజయం సాధిస్తారు. బీసీల కోసం గతంలో ఆయన అనేక ఉద్యమాలు చేశారు. బీసీలందరూ తమ ఓటును కారు గుర్తుకు వేసి కాసానికి మద్దతుగా నిలవాలి.

### పార్టీలకతీతంగా ఏకం కావాలి



**-రాజగోపాలచారి, మాజీ ఎంపీపీ దోమ**

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో బీసీలే ఉన్నారు. అందుకే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీసీ బిడ్డకు పోటీ చేసే అవకాశం ఇచ్చారు. అందువల్ల బీసీలందరూ పార్టీలకతీతంగా ఏకమై కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి. బీసీల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడుతున్న వారికి సరైన బుద్ధి చెప్పాలి. కాసానిని గెలిపించి బీసీల ఐక్యతను చాటాలి.

### బీసీల సత్తా చాటాలి



**-నల్ల రామ్‌నాథ్, వికారాబాద్ జిల్లా బీసీ విద్యార్థి విభాగం జనరల్ సెక్రటరీ, అయినాపూర్, దోమ**

బీసీ యువత ఏ పార్టీలో ఉన్నా బీసీల ముద్దు బిడ్డ జ్ఞానేశ్వర్ గెలుపునకు కృషి చేయాలి. కాసాని జ్ఞానేశ్వర్ 96 బీసీ కులాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారు. అలాంటి వ్యక్తికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశాన్ని కల్పించారు. అందువల్ల పార్టీలకతీతంగా బీసీ యువత, ఓటర్లు ఏకమై ఈ ఎన్నికల్లో కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకుని.. మన సత్తాను చాటాలి.

### కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టాలి



**-బీ.రాజు ముదిరాజ్, బీసీ నాయకుడు, కొత్తగూడ**

బీసీలను విస్మరించే పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలంటే ఈ ఎన్నికల్లో కాసాని జ్ఞానేశ్వర్‌ను చేవెళ్ల నుంచి భారీ మెజార్టీతో గెలిపించాలి. ఆయన బీసీల పక్షాన ప్రశ్నించే గొంతుకగా ముందుండి పోరాటం చేస్తున్నారు. బడుగులు బలపడొద్దని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలను ఈ ఎన్నికల్లోనే తిప్పికొట్టాలి.

### లోక్‌సభలో బీసీల వాణి వినిపిస్తుంది..



**-చింతల నవీన్‌కుమార్, ఐటీ ఉద్యోగి, కొత్తగూడ**

నిస్వార్థంగా బీసీల అభ్యున్నతికి కృషి చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌ను ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి బీసీపైనా ఉన్నది. ఆయన పార్లమెంట్‌కు వెళ్తే బీసీల సమస్యలు పరిష్కారమవుతాయి. మన వాణి లోక్‌సభలో వినిపిస్తుంది. ఓటు బ్యాంకుగా వాడుకునే రాజకీయ పార్టీల మాటలను నమ్మి మోసపోకుండా బీసీలు ఐక్యతతో ముందుకెళ్లాలి.

### బీసీలు మౌనం వీడాలి



**-ప్రదీప్‌కుమార్, లింగాయత్ సంఘం నాయకుడు, బడంగ్‌పేట**

బీసీలు మౌనం వీడాలి. బీసీలకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో ఉన్న కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాలి. మౌనంగా ఉండడంతోనే అధికారానికి దూరంగా ఉంటున్నాం. కాసాని గెలుపునకు బీసీల్లో ఉన్న అన్ని కులాలను ఏకం చేద్దాం. ఇంతకాలం వివిధ వర్గాల వారికి మద్దతు ఇచ్చాం.

### బీసీల ప్రాధాన్యత పెరుగుతుంది..



**నాగరాజు, బీసీ సంఘం నాయకుడు, బడంగ్‌పేట**

కాంగ్రెస్, బీజేపీలు బీసీలకు అన్యాయం చేస్తున్నాయి. బీఆర్ఎస్‌తోనే బీసీలకు న్యాయం జరుగుతుంది. ఇప్పుడు జరుగుతున్న ఎన్నికల్లో బీసీ అభ్యర్థి అయిన కాసానిని గెలిపించుకుంటే రానున్న రోజుల్లో బీసీల ప్రాధాన్యత రాజకీయాల్లో మరింత పెరుగుతుంది. అన్ని పార్టీలు బీసీలకు సీట్లు ఇచ్చేందుకు ముందుకొస్తాయి. కాసాని గెలుపుతో బీసీల్లో చైతన్యం వస్తుంది.

### కాసాని విజయం.. బీసీల గెలుపు



**-గోపాల్ ముదిరాజ్, మండల ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి, యాలాల**

బీసీల గొంతుకను గత ప్రభుత్వాలు అణచివేశాయి. ఇప్పుడు మన గళం వినిపించాల్సిన సమయం వచ్చింది. అగ్రవర్ణ నాయకుల అహంకారపూరిత మాటలకు ఓటు ద్వారా సమాధానం చెప్పాలి. కొన్నేండ్లుగా బీసీలు రాజకీయంగా వెనుకబడిపోయారు. కాసాని గెలుపుతో బీసీల గొంతుక లోక్‌సభలో వినిపిస్తుంది. ఓటు మన చేతిలో ఉన్నది.. విజయం మన ముంగిట ఉన్నది. ఈ అవకాశాన్ని బీసీ బిడ్డలు చేజార్చుకోవద్దు.

### బీసీలు ఏకం కావాలి..



**-చాకలి వెంకటేశ్, హాజీపూర్, యాలాల**

కాంగ్రెస్ నాయకుల మాటలు బీసీలను అవమానపర్చేలా.. ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయి. ఇప్పుడు బీసీల ఐక్యత చూపించాల్సిన సమయం ఆసన్నమైనది. రాజకీయంగా బీసీలను అగ్రవర్ణ నాయకులు ఎదుగనివ్వడంలేదు. బీసీలందరూ పార్టీలకతీతంగా ఏకమై చేవెళ్లలో కాసానిని గెలిపించి మన సత్తాను చాటాలి.

### జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుంటాం..



**-రవి, పట్లూర్, మర్పల్లి**

బీసీలందరం ఏకమై కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన కాసానికి బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల ఎంపీ టికెట్ ఇవ్వడం సంతోషకరం. బీసీలను చిన్నచూపు చూస్తున్న పార్టీలకు కనువిప్పుకలిగేలా ఈ ఎన్నికల్లో కాసానిని గెలిపించుకుంటాం. బీసీలు ఐక్యంగా ఉంటే ఎలా ఉంటుందో అందరికీ అర్థమయ్యేలా చేస్తాం.

### బీసీలను ఏకం చేసిన నాయకుడు కాసాని



**- గోవర్ధన్, వికారాబాద్**

రాష్ట్రంలో 96 కులాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి వారి సమస్యలపై పోరాటం చేసిన ఘనత కాసాని జ్ఞానేశ్వర్‌కే దక్కుతుంది. అలాంటి నాయకుడిని గుర్తించిన కేసీఆర్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించడం గొప్ప పరిణామం. బీసీల సమస్యలు పరిష్కారం కావాలంటే కాసాని ఎంపీగా గెలవాల్సిందే. మన సత్తా చాటాల్సిందే.

### పార్లమెంట్‌లో చర్చించేవారు కావాలి



**-రాజు, శాస్త్రీపురం, రాజేంద్రనగర్**

పార్లమెంట్‌లో తెలంగాణ సమస్యలపై చర్చించేవారు కావాలి. అందుకు బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ బలపర్చిన కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపిస్తేనే అది సాధ్యమవుతుంది. కాంగ్రెస్, బీజేపీల ఎంపీ అభ్యర్థులు ఎప్పుడూ రాష్ట్ర సమస్యలపై మాట్లాడడంలేదు. రాష్ట్రాభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం. పదేండ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందింది.

### జాతీయ పార్టీలు ప్రజలను పట్టించుకోవు..



**-వెంకటరమణ, సులేమాన్‌నగర్ డివిజన్, రాజేంద్రనగర్**

జాతీయ పార్టీలు మన సమస్యలను పట్టించుకోవు. ఎన్నికలప్పుడే ప్రజల మధ్య హడావుడి చేసి.. ఆ తర్వాత కనిపించవు. కానీ.. బీఆర్ఎస్ పార్టీ అలా కాదు.. తెలంగాణ అభివృద్ధే ధ్యేయంగా ఆ పార్టీ ఏర్పడింది. కాసాని జ్ఞానేశ్వర్‌ను బీసీలందరూ గెలిపించుకోవాలి. పార్లమెంట్‌లో బీసీల వాయిస్ వినబడాలంటే..బీసీ నాయకుడిని ఎంపీగా గెలిపించుకోవాలి.



సీడీని విడుదల చేస్తున్న కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

# ఓటర్లు.. ఎన్నికల్లో పాల్గొనండి

**లోక్‌సభ ఎన్నికల ఆడియో సందేశం సీడీ విడుదల**

షాబాద్, ఏప్రిల్ 25: లోక్‌సభ ఎన్నికల ఆడియో సందేశం సీడీని గురువారం కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి విడుదల చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో పాల్గొనాల్సిందిగా ఓటర్లను కోరుతూ ఈ ఆడియో సందేశాన్ని రూపొందించారు. అదే విధంగా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ స్వీప్ సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్, డీఆర్డీవో శ్రీలత, రాజేంద్రనగర్ ఆర్డీవో పాల్గొన్నారు.




స్వీప్ సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

## తాగునీటి సమస్య తలెత్తొద్దు

**కలెక్టర్ నారాయణరెడ్డి**



వికారాబాద్, ఏప్రిల్ 25 : జిల్లాలోని అన్ని గ్రామాల్లో వేసవి కాలం ఉష్ణోగ్రతలు ఎక్కువ ఉన్న సందర్భంగా తాగు నీటి సమస్య లేకుండా చూడాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి అన్నారు. గురువారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ ప్రజలకు తాగునీటి కొరత లేకుండా సంబంధిత అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా పశువులకు నీటి తొట్లెను శుభ్రం చేసి నీటిని ఏర్పాటు చేయాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పనుల్లో లేబర్ సమీకరణ చేస్తూ లక్ష్యం మేరకు అంచనా ప్రకారం ముందుకు వెళ్లాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. లేబర్ సమీకరణపై మండలాల వారీగా ఏ మండలంలో ఎంత మంది లేబర్ వస్తున్నారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో అడిషనల్ డీఆర్‌డీఏ సరోజ, డీపీవో జయసుధ, ఎంపీ డీవోలు, ఎంపీవోలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఓటర్లకు సమాచార డైరీ అందించాలి

**అదనపు కలెక్టర్ లింగ్యానాయక్**

కొడంగల్, ఏప్రిల్ 25 : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఓటరుకూ ఓటరు చీటీతో పాటు ఓటు వేసే సమాచార డైరీని అందించేలా కృషి చేస్తున్నామని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఆల్ పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటింగ్‌పై ఓటర్లకు పూర్తి అవగాహన కలిగే విధంగా చీటీతో పాటు ఓటుకు సంబంధించిన సమాచార డైరీని అందించే విధంగా ప్రణాళిక కొనసాగుతున్నట్లు తెలిపారు. ఓటు హక్కును ఎవరు ఏవిధంగా వినియోగించుకోవాలో ఈ డైరీలో క్లుప్తంగా పొందుపరిచినట్లు తెలిపారు. మొత్తం ఓటర్లు 2.41.794లక్షల మంది ఉన్నట్లు పేర్కొన్నారు. 7కొత్త పోలింగ్ కేంద్రాలు అందుబాటులోకి రావడం జరిగిందన్నారు. అదేవిధంగా 162 సర్వీస్ ఓటర్లు, 120 మంది దివ్యాంగులు, వృద్ధ ఓటర్లను గుర్తించి వారికి ఇంటివద్దే ఓటింగ్ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 92 మంది దరఖాస్తు చేసుకున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, తహసీల్దార్ విజయ్‌కుమార్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది, ఆల్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**ఆలయ భూములు అన్యాక్రాంతం కావొద్దు**

వికారాబాద్ : దేవాదాయశాఖ భూములు అన్యాక్రాంతం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ల్యాండ్ రెవెన్యూ కమిషనర్ ఆదేశాల మేరకు దేవదాయ శాఖ భూముల అన్యాక్రాంతం పై రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ... దేవాదాయ శాఖకు సంబంధించి సర్వే నంబర్ల వారీగా భూముల వివరాలను అందించాలన్నారు. భూముల వివరాలకు సంబంధించి ధరణి పోర్టల్లో గల వివరాలతో సరి చూడాలని రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శేఖర్, జిల్లా ఇన్‌స్పెక్టర్ మధుబాబు, తాండూరు, వికారాబాద్ ఆర్డీవో కార్యాలయాల డీఏవోలు మునీరుద్దీన్, గోవిందమ్మ, ఎం-సెక్షన్ సూపరింటెండెంట్ శివ, శ్రీనివాస్ పాల్గొన్నారు.




కొడంగల్ : సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

# హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి

**మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్**

వికారాబాద్, ఏప్రిల్ 25 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. గురువారం వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ధన్నారానికి చెందిన రైతు పొలాల్లోకి వెళ్లి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రైతుల తరపున డిమాండ్ చేశారు. మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్, రూ.2 లక్షల రుణ మాఫీ, ఎకరానికి రూ.15వేల రైతుబంధు వెంటనే అమలు చేయాలని పోస్టుకార్డు ఉద్యమం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి రాసి పంపారు. కార్యక్రమంలో వికారాబాద్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు రాములు, గోపాల్, రామస్వామి, నాయకులు విజయ్‌కుమార్, మల్లేశం, షఫీ పాల్గొన్నారు.



హామీలు నెరవేర్చాలని పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టిన మాజీ ఎమ్మెల్యే ఆనంద్

## డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

**జిల్లా సంక్షేమ అధికారిణి జ్యోతీపద్మ**



వికారాబాద్, ఏప్రిల్ 25 : 2024-25 సంవత్సరానికి దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా టెక్నికల్ సంస్థ హైదరాబాద్ లో 3 సంవత్సరాల టెక్నికల్ డిప్లొమా కోర్సులకు అనాథ పిల్లలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి జ్యోతి పద్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనాథ బాలికలు, తల్లిని లేదా తండ్రిని కోల్పోయిన బాలికలు నుంచి అక్రమ రవాణాకు గురైన, దివ్యాంగ బాలికలు డిప్లొమా కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం మహిళాభివృద్ధి-శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో శిక్షణను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్, కంప్యూటర్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి కోర్సులో 60 సీట్లు గాను మొత్తం 240 సీట్లు ఉన్నట్లు తెలిపారు. బాలికలు పాలిటెక్నిక్ అర్హత ప్రవేశ పరీక్ష రాయకున్నా కనీసం పదో తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలని ఆమె వివరించారు. కోర్సుల్లో మూడు శాతం సీట్లు దివ్యాంగులకు కేటాయించడం జరిగిందన్నారు. ఎంపికైన బాలికలకు ఉచిత విద్యతో పాటు వసతి సౌకర్యం కల్పించబడుతుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునేవారు కులం (అనాథ బాలికలకు అవసరం లేదు), ఆదాయ ధ్రువీకరణ (అనాథ బాలికలకు అవసరం లేదు), తల్లిదండ్రుల మరణ ధ్రువీకరణ పత్రం, బోనాఫైడ్ సర్టిఫికెట్లను దరఖాస్తు ఫారానికి జత చేసి మే 20 తేదీలోపు సమర్పించాలని తెలిపారు. ఇతర వివరాలకు వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్నెపల్లి సంఘం లక్ష్మీబాయి పాఠశాల ఎదురుగా బాల రక్ష భవన్ (జిల్లా బాలల పరిరక్షణ విభాగం), ఫోన్ నం : 9640863896, 9849672296లో సంప్రదించవలసిందిగా కోరారు.



ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారి గోపాల్

## అవకతవకల్లేకుండా ధాన్యం తూకం

దోమ/కులకచర్ల 25 : సరైన తేమ శాతం ఉన్న వరి ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ అన్నారు. కులకచర్ల మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని గురువారం వ్యవసాయ అధికారి గోపాల్ తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి ధాన్యం తూకం ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం మాత్రమే ఉండాలని కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు ఆయన సూచించారు. అనంతరం ఆయన మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి విత్తనాలు ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచి నాణ్యతా ప్రమాణాలను పాటించి అమ్మాలని నిర్వాహకులకు తెలుపుతూ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని దుకాణదారులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వీరస్వామి, ఏవో బాబు కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# మలేరియా రహిత సమాజాన్ని నిర్మిద్దాం

**దోమలతో సోకే వ్యాధులపై అవగాహన కల్పించాలి**

**జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరరావు**

షాద్‌నగర్‌టౌన్, ఏప్రిల్ 25: మలేరియా రహిత సమాజాన్ని నిర్మిద్దామని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖాన ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా మలేరియా ఆఫీసర్ రాకేశ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దోమల ద్వారానే మలేరియా, డెంగీ, మెదడు వాపు, బోదవ్యాధి, చికెన్‌గున్యా వంటి వ్యాధులు వస్తాయన్నారు. ముఖ్యంగా దోమల ద్వారా విష జ్వరాలు వస్తున్నాయన్నారు. నివాసాలతో పాటు పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలతో సోకే వ్యాధులపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. దోమలతో సోకే వ్యాధులు, దోమల నియంత్రణకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, షాద్‌నగర్ డివిజన్‌లోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, జిల్లా మలేరియా కార్యాలయ సిబ్బంది, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.




అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరరావు

**మలేరియాను అరికట్టాలి**

వికారాబాద్ : మలేరియాను అరికట్టాల్సిన బాధ్యత మనపై ఉందని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి పాల్వన్‌కుమార్ అన్నారు. గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పాల్వన్‌కుమార్ కార్యాలయంలో మలేరియా అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియాను నిర్మూలించడమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ప్రజల్లో ఆరోగ్య సంరక్షణ పట్ల అవగాహన పెరుగడం, గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం వలన మలేరియా కేసుల సంఖ్య గణనీయంగా తగ్గిందని తెలిపారు. మలేరియా వ్యాధిని వ్యాపింపజేసే దోమల పెరుగుదలను అరికట్టడానికి నిరంతరం జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. ఈ ర్యాలీలో కార్యాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాలొన్నారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

## ముగిసిన ఆలయ బ్రహ్మోత్సవాలు

మొయినాబాద్, ఏప్రిల్ 25 : చిలుకూరు బాలాజీ ఆలయ బ్రహ్మోత్సవాలు ఎనిమిదో రోజు చక్ర తీర్థంతో ముగిశాయి. స్వామివారికి సర్వసైనాధిపతి అయిన చక్రస్వామి ఆధ్వర్యంలో చివరిరోజు ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పూర్ణాహుతి ప్రసాదాన్ని అష్టదిక్పాలకులకు నైవేద్యంగా పెట్టి బలిహరణం చేశారు. అంతకు ముందు స్వామివారిని శ్రీదేవీ, భూదేవి సమేతంగా అద్దాల పల్లకీలో ఊరేగించారు. మండపంలో నవకలశ స్థాపనం, పాలికల పూజాతో దేవుళ్లందరినీ ఆవాహనం చేసి సుగంధద్రవ్యాలతో నవకలశ అభిషేకం చేశారు. అనంతరం చక్రస్వామికి ఆలయ సమీపంలోని గండిపేట చెరువులో చక్రస్నానం చేయించారు. కార్యక్రమానికి హాజరైన భక్తులందరికీ చక్రతీర్థాన్ని పంపిణీ చేశారు. ఉత్సవాల్లో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాలకృష్ణస్వామి, అర్చకులు సీఎస్ రంగరాజన్, తిరుమల కిరణాచారి, పరావస్తు రామాచారి, నరసింహన్, కిట్టుస్వామి, కన్నయ్య, సురేశ్, అనిల్ పాల్గొన్నారు.



స్వామివారికి చక్రస్నానం చేయించేందుకు వెళ్తున్న అర్చకులు